## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వెంకటాపూర్, నవంబర్ 7 : మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్‌లో చందన గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ములుగు ఐకేపీ డీపీఎం గోవింద్‌చౌహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు అమ్మవద్దని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అలవాల రవి, సీసీ ఐలయ్య, మేడారం డైరెక్టర్ మిల్కూరి ఐలయ్య, మాజీ ఎంపీటీసీ పోశాల అనిత వీరమల్లు, కమిటీ సభ్యులు మెట్టు రజిని, శోభ, నిరోష, సమలత, కన్నక్క పాల్గొన్నారు.

## ఓటరుగా నమోదు చేసుకోండి

వెంకటాపూర్, నవంబర్ 7 : 18యేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సదానందం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశాల మేరకు ఈ నెల 9, 10 తేదీల్లో గ్రామాల్లో ఓటరు నమోదుపై ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబితాలో తప్పొప్పులు, సవరణలు ఈ నెల 28వ తేదీ వరకు సరిచేసుకోవచ్చని తహసీల్దార్ సదానందం తెలిపారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

గోవిందరావుపేట, నవంబర్ 7 : రెండు నెలల క్రితం గోవిందరావుపేట గ్రామానికి బైక్ వస్తూ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న పస్రా గ్రామానికి చెందిన సాయిభరత్‌కు గురువారం ఎస్సై కమలాకర్ పస్రా పీఎస్‌లో మొబైల్‌ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా లొకేషన్ ఆధారంగా ఫోన్‌ను కనిపెట్టి అందించినట్లు తెలిపారు.

## 'షెడ్యూల్డ్ ప్రాంతాన్ని విచ్ఛిన్నం చేస్తున్న రాష్ట్రప్రభుత్వం'

వాజేడు, నవంబర్ 7 : షెడ్యూల్డ్ ప్రాంత విచ్ఛిన్నానికి రాష్ట్రప్రభుత్వం పాల్పడుతుందని ఆదివాసీ నవ నిర్మాణసేన మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు ఆరోపించారు. మండలకేంద్రంలో గురువారం ఆయన కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన ఐదో షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలను ఉల్లంఘించేలా ఉందన్నారు. షెడ్యూల్డ్ ఏరియాలో వలస గిరిజనేతరులకు కులగణన చేపట్టడం రాజ్యాంగా వ్యతిరేకమని అన్నారు. ఆదివాసీలకు అన్యాయం జరిగేలా ఉన్న బీసీ కులగణనను నిలిపివేయాలని, లేదంటే అడ్డుకుంటామని అన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### గ్రంథాలయ సంస్థ ములుగు చైర్మన్ రవిచందర్

తాడ్వాయి, నవంబర్ 7 : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ అన్నారు. మండలకేంద్రంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 26మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. అనంతరం జూనియర్ కళాశాలను పరిశీలించారు. పలు సమస్యలను రవిచందర్ దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 7 : భూపాలపల్లి మండలం కమలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరాటే మాస్టర్ శ్రీనివాస్ విద్యార్థినిలకు కరాటే శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వీయ ఆత్మరక్షణ శిక్షణ తరగతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.























